




# కలం కౌంటర్

KALAM COUNTER TELUGU DAILY

తెలుగు దినపత్రిక

సంపుటి : 9 సంచిక : 222

పేజీలు : 4 వెల రూ.4/-

Circulated by : Krishna, Guntur, Prakasam, Nellore, West Godavari, Khammam, Hyderabad, Chittor

బుధవారం 14 జనవరి 2026


# నారావారిపల్లెలో అభివృద్ధి పండుగ

- రూ.కోట్లతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన
- ప్రారంభోత్సవాలు చేసిన సీఎం చంద్రబాబు













**నారావారిపల్లె, తిరుపతి,కలంకౌంటర్ :** నారావారిపల్లె గ్రామంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటన సందర్భంగా అభివృద్ధి పనుల శుభారంభంతో గ్రామం పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది. కోట్ల రూపాయల వ్యయంతో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపన చేయడంతో పాటు ప్రారంభోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఏర్పాటు చేసిన వివిధ స్టాళ్లను ముఖ్యమంత్రి సందర్శించారు. మిల్లెట్ టిఫిన్స్, ఫుడ్ బాస్కెట్ ప్రోగ్రామ్, ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల స్టాళ్లను పరిశీలిస్తూ నిర్వాహకులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. పోషకాహారం ద్వారా ప్రజల ఆరోగ్యం మెరుగుపడాలని సూచించారు. స్టాళ్ల సందర్శన సమయంలో "నమస్తే సరు అంటూ పలకరించిన అంగన్వాడీ చిన్నారులను చూసి సీఎం చంద్రబాబు ప్రత్యేకంగా వారి వద్దకు వెళ్లి ఆప్యాయంగా మాట్లాడారు. పిల్లల చదువు, ఆరోగ్యం, భవిష్యత్తుపై శ్రద్ధ తీసుకోవాలని అంగన్వాడీ సిబ్బందికి సూచనలు చేశారు. షైనింగ్ సెంటర్స్ తమ పిల్లలకు ఎంతో ఉపయోగపడుతున్నాయని, పిల్లల్లో స్పష్టమైన ఎదుగుదల కనిపిస్తోందని అక్కడున్న మహిళలు సీఎంకు వివరించారు. ఈ కార్యక్రమాలు గ్రామీణ ప్రాంతాల్లో విద్యా, ఆరోగ్య ప్రమాణాలను పెంచడంలో కీలకమని సీఎం పేర్కొన్నారు. అనంతరం రూ.1.4 కోట్లతో నిర్మించిన స్కిల్ బిల్డింగ్ సెంటర్‌ను సీఎం ప్రారంభించారు. యువతకు నైపుణ్య శిక్షణ అందించి ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా ఈ కేంద్రం ఉపయోగపడుతుందని తెలిపారు. అలాగే రూ.4.27 కోట్లతో నిర్మించిన 33/11 కేవీ సెమీ ఇండోర్ సబ్‌స్టేషన్‌ను ప్రారంభించి విద్యుత్ సరఫరా మరింత బలోపేతం అవుతుందని వెల్లడించారు. కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో సంజీవని ప్రాజెక్టును సీఎం ప్రారంభించి, గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని అన్నారు. అలాగే రూ.70 లక్షలతో ఎ-రంగంపేట--భీమవరం రోడ్డు నుంచి శేషాచల లింగేశ్వర స్వామి ఆలయం వరకు నిర్మించిన రహదారిని ప్రారంభించారు. నీవా బ్రాంచ్ కెనాల్ నుంచి కల్యాణి డ్యామ్‌కు, మూలపల్లి చెరువు సహా మరో నాలుగు చెరువులకు నీటిని తరలించే పనులకు సీఎం శంకుస్థాపన చేశారు. ఈ ప్రాజెక్టుల ద్వారా సాగునీటి సమస్యలు తగ్గి రైతులకు లాభం చేకూరుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే పులివర్తి నాని, తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, జిల్లా కలెక్టర్‌తో పాటు ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# సార్లంకపల్లె అగ్నిప్రమాదంపై సీఎం చంద్రబాబు సమీక్ష

- బాధిత కుటుంబాలకు అన్ని విధాలా సహాయం అందించాలని ఆదేశం
- ప్రత్యేక క్యాంప్ ద్వారా ఆధార్ కార్డులు, ఇతర కీలక పత్రాలు జారీ చేయాలని సూచన




**నారావారిపల్లి,కలంకౌంటర్ :** కాకినాడ జిల్లా సార్లంకపల్లెలో సంక్రాంతి పండుగ సమయంలో జరిగిన అగ్నిప్రమాదం తీవ్ర విషాదాన్ని మిగిల్చిందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. ఈ ఘటనపై మంత్రులు, అధికారులతో ముఖ్య మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. అగ్ని ప్రమాదంలో గ్రామంలోని మొత్తం 38 తాటాకు ఇళ్లు పూర్తిగా కాలిపోయాయని అధికారులు వివరించగా... నష్టపోయిన బాధిత కుటుంబాలకు అన్ని విధాలుగా అండగా నిలవాలని సీఎం ఆదేశించారు. ప్రస్తుతం బాధిత కుటుంబాలకు అందిస్తున్న సహాయక చర్యలను హెూంమంత్రి అనితతో పాటు సంబంధిత అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. బాధితులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా తాత్కాలిక వసతి, ఆహారం ఏర్పాటు చేసి వారికి అండగా నిలవాలని ముఖ్యమంత్రి సూచించారు. తక్షణ సహాయంగా ఒక్కో బాధిత కుటుంబానికి రూ.25 వేల చొప్పున పరిహారం అందించాలన్నారు. అగ్నిప్రమాదంలో ఇల్లు కోల్పోయిన ప్రతి బాధిత కుటుంబానికి కొత్త ఇల్లు మంజూరు చేయాలని ఆదేశించారు. కొత్త ఇల్లు నిర్మించి అప్పగించే వరకు అవసరమైన వసతి సహా ఇతర అన్ని రకాల సహాయాన్ని ప్రభుత్వం అందించాలని సీఎం స్పష్టం చేశారు. అగ్ని ప్రమాదంలో కాలిపోయిన ఆధార్ కార్డులు, ఇతర కీలక డాక్యుమెంట్లను బాధితులకు తిరిగి జారీ చేయడానికి సార్లంకపల్లెలో ప్రత్యేక క్యాంపులు నిర్వహించాలని ఆదేశించారు. బాధిత కుటుంబా లకు అందుతున్న సహాయ కార్యక్రమాలను జిల్లా ఉన్నతాధికారులు, మంత్రులు నిరంతరం పర్యవేక్షించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు.

# ప్రతి కుటుంబంలో భోగి భోగభాగ్యాలు నింపాలి

## - డూండీ రాకేష్ ఆర్యవైశ్య కార్పోరేషన్ చైర్మన్

**విజయవాడ,కలంకౌంటర్ :** మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అయిన అచ్చమైన తెలుగు పండుగ సంక్రాంతి. ఈ మకర సంక్రాంతి ప్రతి ఒక్కరి జీవితంలో ఆనందం, శాంతి, సౌభాగ్యాలను నింపాలని, ధనిక--పేద భేదాలు లేకుండా అన్ని వర్గాల ప్రజలు ఈ పండుగను సంతోషంగా జరుపుకోవాలి. భోగి మంటలు, రంగవల్లులు, హరిదాసుల కీర్తనలు, గంగిరెద్దుల ఆటలు, గాలిపటాల సందడితో భోగి, సంక్రాంతి, కనుమ పండుగలను రాష్ట్రంలోని ప్రతి కుటుంబం ఆనందంగా జరుపుకోవాలని, రాష్ట్ర ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను.








# క్షుద్ర రాజకీయాలు మానుకోకుంటే నీకు రాజకీయ గల్లంతే

- జగన్ కు మంత్రి సవిత హెచ్చరిక
- సముద్రం పాలవుతున్న వరద నీటిని రాయలసీమకివ్వడం అన్యాయమా..?
- రాయలసీమను సస్య శ్యామలం చేయడంపై ఆ ప్రాంత బిడ్డగా మీకిష్టం లేదా..?
- స్కిల్ తప్పుడు కేసు అని తెలుగు జాతి నమ్మింది
- వారి నమ్మకమే రుజువైంది...
- మంత్రి సవిత



**పెనుకొండ/శ్రీసత్యసాయి,కలంకౌంటర్ :** 'రాయలసీమను సస్య శ్యామలం చేయాలని సీఎం చంద్రబాబునాయుడు అహర్నిశలు కృషి చేస్తుంటే, రాయలసీమ బిడ్డగా సహకరించడం మానేసి, జగన్ విషం కక్కుతున్నారు... స్వార్థ రాజకీయాల కోసం అన్నదమ్ముల్లా ఉండే తెలంగాణా, ఏపీ ప్రజల మధ్య బీఆర్ఎస్ నేతలతో కలిసి చిచ్చుపెడుతున్నారు.... కోర్టులో కేసులు వేసి, రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని నేనే ఆపించానని బీఆర్ఎస్ నాయకుడు హరీష్ రావు అంటుంటే వైసీపీ బ్యాచ్ ఎందుకు ఖండించలేదు... బీఆర్ఎస్ నేతలతో వారికున్న చీకటి ఒప్పందం ఏమిటి..? .. ఇలా కుట్ర రాజకీయాలకు పాల్పడితే ఇప్పుడున్న 11 సీట్లు కూడా గల్లంతై... నీ చేతిలో ప్రజలు గుండు సున్నా పెట్టడం ఖాయం' అని జగన్ ను రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత హెచ్చరించారు. పెనుకొండలోని క్యాంపు కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఏపీలో సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణంలోగాని, నదుల అనుసంధానంలో గాని సీఎం చంద్రబాబు పాత్ర మరువలేనిదన్నారు. ముఖ్యంగా రాయలసీమను సస్యశ్యామలంగా చేయడానికి ఆయన రేయింబవళ్లు కృషి చేస్తున్నారన్నారు. తెలంగాణాలోని రాజకీయ పక్షాలు తమ ఉనికి కోసం సీఎం చంద్రబాబు పేరును పావుగా చేసుకుని క్షుద్ర రాజకీయాలు చేస్తున్నాయన్నారు. రాయలసీమ బిడ్డగా వాటిని ఖండించాల్సిన జగన్, తన కరపత్రం మీడియా ద్వారా సీఎం చంద్రబాబుపైనా, కూటమి ప్రభుత్వంపైనా విషం కక్కుతున్నారన్నారు.

**బీఆర్ఎస్ నేతలతో జగన్ కున్న ఒప్పందం ఏమిటి..?** కోర్టులో కేసుల వేసి, రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని తానే ఆపించానని బీఆర్ఎస్ నాయకుడు, మాజీ మంత్రి హరీష్ రావు ప్రకటించిన విషయాన్ని మంత్రి సవిత గుర్తు చేశారు. హరీష్ రావు వ్యాఖ్యలపై జగన్ గాని, ఆయన బ్యాచ్ గాని ఎందుకు స్పందించలేదని స్పందించలేదన్నారు. రాయలసీమకు జలాలివ్వకుండా బీఆర్ఎస్ నేతలు అడ్డుపడుతుంటే, జగన్ ఎందుకు మౌనంగా ఉంటున్నారని ప్రశ్నించారు. వారితో జగన్ కున్న చీకటి ఒప్పందం ఏమిటని నిలదీశారు. బీఆర్ఎస్ నేతలతో జగన్ కు విడదీయరాని బంధం ఉందంటూ, తాడేపల్లిలోని ఆయన ప్యాలెస్ ముందు కేసీఆర్ తో కలిసి ఉండే భారీ ఫ్లెక్సీని ఏర్పాటు చేశారని తెలిపారు. అందుకు సంబంధించిన క్లిప్పింగ్ ను మంత్రి సవిత ప్రదర్శించారు. నాంపల్లి కోర్టుకు జగన్ వెళ్లినప్పుడు బీఆర్ఎస్ నేతలు అక్కడ భారీగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి ఘన స్వాగతం పలుకుతారన్నారు. కేసీఆర్ ఖమ్మం జిల్లాకు వస్తే అక్కడ వైసీపీ నాయకులకు ఆయనకు స్వాగతం పలుకుతారని, వారి మధ్య అపూర్వ బంధం ఉందనడానికి ఇంతకంటే నిదర్శనం ఇంకేమి కావాలని అన్నారు. జగన్ అసమర్థత వల్లే రాయలసీమ ఎత్తిపోతల పథకం నిలిచిపోయిందని బీఆర్ఎస్ నేతల వ్యాఖ్యలతో మరోసారి బయటపడిందని మంత్రి సవిత తెలిపారు.

**రాయలసీమకు వరద జలాలివ్వడం అన్యాయమా..?** వెనుకబడిన రాయలసీమను సస్య శ్యామలం చేయడానికి సీఎం చంద్రబాబునాయుడు సముద్రంలో కలిసిపోతున్న గోదావరి వరద జలాలివ్వాలని సంకల్పించారని మంత్రి సవిత తెలిపారు. సముద్రంలో కలిసిపోతున్న మూడు వేల టీఎంసీల్లో రెండొందల టీఎంసీలు రాయలసీమకు ఇవ్వాలని నిర్ణయిస్తే...అదేదో తెలంగాణాకు పెద్ద ఎత్తున అన్యాయం జరుగుతున్నట్లు బీఆర్ఎస్ నేతలు హడావిడి చేస్తున్నారన్నారు. సముద్రంలో వృథగా కలిసిపోతున్న జలాలను రాయలసీమకు ఇవ్వడం అన్యాయమా..? అని మంత్రి ప్రశ్నించారు. ఇదే విషయం బీఆర్ఎస్ నేతలను జగన్ ఎందుకు ప్రశ్నించడంలేదన్నారు. తమ స్వార్థ రాజకీయాల కోసం వైసీపీ, బీఆర్ఎస్ నాయకులు రెండు తెలుగు రాష్ట్రాల మధ్య చిచ్చుపెట్టాలని చూస్తున్నారని విమర్శించారు. మొదటి అపెక్స్ మీటింగ్ లో అప్పటి తెలంగాణ సీఎం కేసీఆర్ ను ఒప్పించి సీఎం చంద్రబాబు నాయుడు కృష్ణా జలాల్లో ఏపీకి 512 టీఎంసీల నీటిని హక్కుగా సాధించారన్నారు. జగన్ హయాంలో జరిగిన రెండో అపెక్స్ మీటింగ్ లో ఏపీ ప్రయోజనాలను కేసీఆర్ కు తాకట్టుపెట్టారన్నారు. ఫిఫ్టీ ఫిఫ్టీ అంటూ కేసీఆర్ చేసిన డిమాండ్లను గట్టిగా తిప్పికొట్టకుండా మౌనం వహించిన జగన్ రాయలసీమకు, రాష్ట్రానికి తీరని ద్రోహం చేశారన్నారు. ప్రజలంతా గమనిస్తున్నారని, జగన్ ఇలాగే వ్యవహరిస్తే, ఇప్పుడున్న 11 సీట్లు కూడా గల్లంతు చేసి, వచ్చే ఎన్నికల్లో ఆయన చేతుల్లో గుండు సున్నా పెడతారని హెచ్చరించారు. రాయలసీమ ప్రాంత అభివృద్ధే సీఎం చంద్రబాబు, కూటమి ప్రభుత్వ లక్ష్యమని, ఆ ప్రాంతాన్ని అన్ని రంగాల్లోనూ ముందుంచుతామని మంత్రి సవిత స్పష్టం చేశారు.

**కడిగిన ఆణిముత్యం సీఎం చంద్రబాబు..** స్కిల్ డవలప్ మెంట్ కేసును ఏసీబీ కోర్టు కొట్టేయడంపై మంత్రి సవిత హర్షం వ్యక్తంచేశారు. జగన్ రెడ్డి ప్రభుత్వం పెట్టిన తప్పుడు కేసు నుంచి సీఎం చంద్రబాబు కడిగిన ముత్యంలా బయటపడ్డారని, నీతికి, నిజాయితీకి నిలువుటద్దం ఆయన అని కొనియాడారు. స్కిల్ కేసు తప్పుడు కేసు అని దేశ విదేశాల్లో ఉన్న తెలుగు ప్రజలంతా గట్టిగా నమ్మారన్నారు. వారి నమ్మకమే ఇప్పుడు నిజమైందన్నారు. ఏపీ అభివృద్ధితో పాటు తమ భవిష్యత్తు కూడా చంద్రబాబుతోనే సాధ్యమని నమ్మి కూటమి ప్రభుత్వానికి అండగా నిలిచారన్నారు.

# సంక్రాంతి సంబరాలు





**మచిలీపట్నం,కలంకౌంటర్ :** మచిలీపట్నం నగర కార్పొరేషన్ 45 డివిజన్ నందు గల ఇండోర్ స్టేడియంలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా, క్రీడలతో సాంప్రదాయ వేడుకలు క్రీడా పోటీలు ఎంతో ఉత్సాహపరితంగా మంగళవారం సాగాయి. ఈ పోటీలు జిల్లా స్పోర్ట్స్ అథరిటీ అధికారి ఝాన్సీ లక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించగా జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్, గొర్రెపాటి గోపీచంద్, బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్, 45 డివిజన్ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జ్, పి. వి. ఫణి కుమార్ లు ప్రారంభించి సాయంత్రం గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. యువత ఉత్సాహంగా చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకునే విధంగా, తాడు లాగుట, తొక్కుడు బిళ్ళ, ఏడు పెం కుల ఆట, కుర్చీలాట, కర్ర సాము, గాలిపటాల ఆటలు మొదలగు ఆటలతో ఎంతో ఉత్సాహంగా పోటీలు జరిగాయి. ఈ కార్యక్రమంలో బ్యాట్మెంటన్ జాతీయ క్రీడాకారుడు, బొమ్మిశెట్టి ప్రభు, ఐటిఐ కాలేజ్ ప్రిన్సిపాల్, కొత్త గుండు రమేష్, తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

# నా దృష్టి కేవలం అభివృద్ధి పైనే-ఎమ్మెల్యే ఇంటూరి

- చిన్న తప్పులను భూతద్దంలో చూపించడం తగదు
- ప్రజలకోసం 24 గంటలూ పనిచేస్తా
- చెరువుల రిపేర్లకు 9 కోట్లు మంజూరు
- మున్సిపాలిటీకి మరో 5 కోట్లు మంజూరు
- -సీఎంఆర్ ఎఫ్ ద్వారా 975 మందికి 7.8 కోట్ల ఆర్థిక సహాయం

**కందుకూరు,కలంకౌంటర్ :** నియోజకవర్గ అభివృద్ధి కోసం తాను 24 గంటలు పని చేస్తున్నానని కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు స్పష్టం చేశారు. టిడిపి కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియా సమావేశం నిర్వహించారు.ఎమ్మెల్యే నాగేశ్వరరావు మాట్లాడుతూ తాను ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత నియోజకవర్గంలో ఇప్పటివరకు సుమారు 300 కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు జరిగాయని వివరించారు. ఎన్నికలకు ముందు హామీ ఇచ్చినట్లుగా నియోజకవర్గంలో రోడ్లను గుంతలు లేకుండా 90 శాతం తీర్చిదిద్దామని తెలిపారు. నియోజకవర్గంలో పేదల ఆరోగ్యం కోసం ఇప్పటివరకు 975 మందికి 7.8 కోట్ల ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆర్థిక సహాయాలు అందించామని ఎమ్మెల్యే నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఇటీవల మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ కందుకూరు పర్యటనకు వచ్చి వెళ్ళగానే, పట్టణ అభివృద్ధి కోసం 5 కోట్ల రూపాయలు మంజూరు చేశారని ఎమ్మెల్యే గుర్తు చేశారు. ఇప్పటివరకు మునిసిపాలిటీ అభివృద్ధికి 25 కోట్లు నిధులు వచ్చినట్లు తెలిపారు. అలాగే గతంలో దిత్వా, మంతా తుఫాను వల్ల దెబ్బతిన్న చెరువుల రిపేర్లకు 9 కోట్లు మంజూరయ్యాయని ఎమ్మెల్యే తెలిపారు. రాళ్లపాడు రిజర్వాయర్ పైన కొత్తగా తారు రోడ్డు నిర్మాణం, ఇతర పనుల కోసం 1.06 కోట్లు తాజాగా మంజూరయ్యాయని చెప్పారు. అభివృద్ధికి సహకరిస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, యువ నాయకులు నారా లోకేష్, ఆయా శాఖల మంత్రులకు ఎమ్మెల్యే నాగేశ్వరరావు కృతజ్ఞతలు తెలిపారు.అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ఇంత పెద్ద ఎత్తున జరుగుతున్న సమయంలో, అక్కడక్కడ చిన్న చిన్న పొరపాట్లు జరగడం



సహజమేనని, వాటిని భూతద్దంలో చూపించడం తగదని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు అభిప్రాయపడ్డారు. నియోజకవర్గ ప్రజల అభివృద్ధి కోసం తనకు సూచనలు సలహాలు అందించాలని మీడియా ప్రతినిధులకు ఆయన విజ్ఞప్తి చేశారు. వాటన్నిటిని కచ్చితంగా పరిశీలించి ప్రజల కోసం ఆచరణలో పెడతానని ఎమ్మెల్యే నాగేశ్వరరావు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ టిడిపి పార్టీ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, కందుకూరు మండల టిడిపి అధ్యక్షులు బుస్సారెడ్డి కృష్ణారెడ్డి, వలేటివారిపాలెం మండలం టిడిపి అధ్యక్షులు మాదాల లక్ష్మీనరసింహం, పార్టీ నాయకులు చదలవాడ కొండయ్య, షేక్ రఫీ, షేక్ రూబీ, నాదెళ్ల వెంకట రమణయ్య, నియోజకవర్గ ప్రొఫెషనల్ వింగ్ అధ్యక్షురాలు పువ్వాడి మౌనిక పాల్గొన్నారు

# తెలుగు ప్రజలకు భోగి శుభాకాంక్షలు తెలిపిన ఏపీ సీఎం చంద్రబాబు

**అమరావతి,కలంకౌంటర్ :** రేపు భోగి పండుగ (జనవరి 14) సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు తెలుగు ప్రజలందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. సంక్రాంతి ముగ్గులతో తెలుగు లోగిళ్లు కళకళలాడుతున్న వేళ, ప్రతి ఒక్కరూ ఈ పండుగను సంతోషంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ మేరకు ఆయన మంగళవారం నాడు ఒక ప్రకటన విడుదల చేశారు. "దేదీప్యమానంగా వెలిగే భోగి మంటలు మీకు, మీ కుటుంబానికి కొత్త వెలుగులు తేవాలని మనసారా కోరుకుంటున్నాను. ప్రజల ఆశావహ దృక్పథంతో కూడిన ఆలోచనలు సాకారం కావాలి. అందుకు నేను మీకు అండగా ఉంటానని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను" అని చంద్రబాబు పేర్కొన్నారు.

ప్రతి ఒక్కరి జీవితం భోగభాగ్యాలతో తులతూగాలని ఆకాంక్షిస్తూ, ప్రజలందరికి మరోమారు భోగి పండుగ శుభాకాంక్షలు తెలుపుతున్నట్లు ఆయన తన సందేశంలో వివరించారు.

# మంత్రి లోకేష్ ట్విట్ కు స్పందించిన ప్రభుత్వ చీఫ్ విప్



**వినుకొండ,కలంకౌంటర్ :** వినుకొండ పట్టణం 20వ వార్డుకు చెందిన అచ్యుత ఏడుకొండలు అనే వ్యక్తి, తమ ప్రాంతంలో సుదీర్ఘ కాలంగా ఎదుర్కొంటున్న లో-వోల్టేజ్ సమస్య గురించి వివరిస్తూ 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా నారా లోకేష్ కు ట్యాగ్ చేస్తూ పోస్ట్ చేశారు. దీనిపై సానుకూలంగా స్పందించిన లోకేష్ , సమస్యను పరిష్కరించాల్సిందిగా ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు ని ఆదేశించారు.మంత్రి ఆదేశాలతో రంగంలోకి దిగిన ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు. విద్యుత్ శాఖ అధికారులు, సమస్య తీవ్రతను గుర్తించి తక్షణమే చర్యలు చేపట్టారు. నూతన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటును ప్రారంభించారు. విద్యుత్ సమస్య పరిష్కారంతో పాటు, అదే ప్రాంతంలో నూతనంగా సిమెంట్ రోడ్డు కూడా నిర్మిస్తామని చీఫ్ విప్ హామీ ఇచ్చారు. తమ సమస్యను సోషల్ మీడియా ద్వారా గుర్తించి, ఇంత వేగంగా స్పందించి పరిష్కరించినందుకు మంత్రి నారా లోకేష్ , చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు కి వార్డు ప్రజలు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పేదలకు నూతన వస్త్రాలు పంపిణీ

**కందుకూరు,కలంకౌంటర్ :** శ్రీరామ సాయి బాబా వెల్ఫేర్ సొసైటీ కందుకూరు వారి ఆధ్వర్యంలో మంగళవారం శ్రీరామ సాయిబాబా వెల్ఫేర్ సొసైటీ సభ్యుల సహకారంతో ఊరి బయట ఉన్న పేద పిల్లలకు నూతన వస్త్రములు పంపిణీ చేయడం జరిగింది.ఈ సందర్భంగా ఆల్ ఇండియా వాసవి సత్ర సముదాయాల మీడియా చైర్మన్ డాక్టర్ చక్కా వెంకట కేశవరావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో శ్రీరామ సాయిబాబా వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు సేవా హృదయ డాక్టర్ రవ్వా శ్రీనివాసులు ,ఈ.సి.మెంబర్. కోట వెంకటేశ్వర్లు, మోదడుగు శ్రీనివాసరావు, ముక్కాల మయూరినాథ్ పాల్గొన్నారు.

# పాడే ఎత్తడానికే స్నేహమున్నది

- జనసేన పార్టీ నాయకులు ఉడుముల బుజ్జి తండ్రి అంతిమ యాత్రలో పాల్గొని
- పాడెమోసిన జనసేన పార్టీ ఇంచార్జ్ బండిరామకృష్ణ.



**మచిలీపట్నం,కలంకౌంటర్ :** జనసేన పార్టీ నాయకులు ఉడుముల బుజ్జి తండ్రి ఉడుముల వెంకటరత్నం శారదా నగర్ లోని వారి స్వగృహంలో ఉదయం కాల ధర్మం చెందారు . అంతిమ యాత్రలో పాల్గొన్న జనసేన పార్టీ ఇంచార్జ్ బండి రామకృష్ణ,జనసేన పార్టీ నగర అధ్యక్షులు గడ్డంరాజు ,డివిజన్ ఇన్చార్జులు, జనసేన పార్టీ నాయకులు, ఉడుముల బుజ్జి కుటుంబ సభ్యులు, స్నేహితులు పాల్గొన్నారు .

# శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరుని సన్నిధిలో బీసీ వెల్ఫేర్ ప్రిన్సిపల్ సెక్రటరీ సత్యనారాయణ





**మోపిదేవి,కలంకౌంటర్ :** మోపిదేవిలో భక్తుల చేత విశేష పూజలు అందుకుంటున్న శ్రీ వల్లి దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారిని బీసీ వెల్ఫేర్ ప్రిన్సిపల్ సెక్రెటరీ ఎస్. సత్యనారాయణ దర్శించుకున్నారు. దేవస్థానానికి వచ్చిన సత్యనారాయణగారిని డిప్యూటీ కమిషనర్ దాసరి శ్రీరామ వరప్రసాదరావు ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు ఘన స్వాగతం పలికారు. ఆలయ ఆవరణలో గల నాగపుట్టలో సత్యనారాయణ పాలు పోసి, మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం సత్యనారాయణ శ్రీ స్వామి వారిని దర్శించుకొనగా, ఆలయ పండితులు ఆయనకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రిన్సిపల్ సెక్రెటరీ ఎస్.సత్యనారాయణ ని దాసరి శ్రీరామ వరప్రసాదరావు ఆలయ మర్యాదలతో సత్కరించి, శ్రీ స్వామి వారి చిత్రపటాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు నౌడూరి విశ్వనాథ సుబ్రహ్మణ్యేశ్వర శర్మ , చింతపల్లి వెంకటేశ్వర శర్మ ప్రసాద్ శర్మ ఆలయ అధికారులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు భోగి శుభాకాంక్షలు



**నారావారి పల్లె,కలంకౌంటర్ :** సంక్రాంతి ముగ్గులతో అలరారుతున్న తెలుగు లోగిళ్లలో భోగి పండుగ జరుపుకుంటున్న తెలుగు ప్రజలకు నా హృదయపూర్వక శుభాకాంక్షలు. దేదీప్యమానంగా వెలిగే భోగి మంటలు మీకు, మీ కుటుంబానికి కొత్త వెలుగులు తేవాలని మనసారా ఆకాంక్షిస్తున్నాను. ఆశావహ దృక్పథంతో సాగే మీ ఆలోచనలు సాకారం కావాలని... అందుకు మీకు అండగా ఉంటానని ఈ సందర్భంగా తెలియచేస్తున్నాను. మీ జీవితం భోగభాగ్యాలతోతులతూగాలని కోరుకుంటూ, మరొక్కమారు అందరికీ భోగి పండుగ శుభాకాంక్షలు తెలుపుకుంటున్నాను

# సంక్రాంతి సందర్భంగా ప్రయాణికులకు మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి కీలక సూచనలు..

- సంక్రాంతికి అదనపు బస్సు చార్జీలు లేవు...మంత్రి
- సొంత, ప్రైవేట్ వాహనాల్లో ప్రయాణికులు జాగ్రత్తగా ఉండాలి : మంత్రి
- ప్రైవేట్ బస్సులు చార్జీలు పెంచి అక్రమ వసూలు చేస్తే బస్సులు సీజ్ చేస్తాం..మంత్రి



**విజయవాడ, కలంకౌంటర్ :** సంక్రాంతి పండుగ సందర్భంగా సొంత ఊళ్లకు వెళ్లే ప్రయాణికుల సౌకర్యార్థం రాష్ట్ర ప్రభుత్వం పలు కీలక నిర్ణయాలు తీసుకున్నట్లు రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి కార్యాలయం నుండి ప్రకటన విడుదల చేశారు. పండుగ రద్దీ దృష్ట్యా మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం యథవిధిగా కొనసాగుతుందని, సంక్రాంతి సందర్భంగా ఎలాంటి అదనపు చార్జీలు విధించబోమని స్పష్టం చేశారు. ఈ ఏడాది ఆర్టీసీ చార్జీల్లో కూడా ఎలాంటి పెంపు లేదని తెలిపారు. సొంత వాహనాలు, ప్రైవేట్ వాహనాల్లో ప్రయాణించే వారు జాగ్రత్తగా నిబంధనలు పాటిస్తూ క్షేమంగా సొంత ఊళ్లకు చేరుకోవాలని మంత్రి ఆకాంక్షించారు. సంక్రాంతికి సొంత ఊళ్లకు వెళ్లే ప్రయాణికులకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరఫున ఇది పండుగ కానుకగా అని అన్నారు. అదే విధంగా ప్రైవేట్ బస్సులు అక్రమంగా చార్జీలు పెంచితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నిబంధనలకు విరుద్ధంగా అధిక చార్జీలు వసూలు చేస్తే సంబంధిత బస్సులను సీజ్ చేయడం జరుగుతుందని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి స్పష్టం చేశారు. పండుగను ప్రజలు ఆనందంగా, సురక్షితంగా జరుపుకోవాలని మంత్రి ఆకాంక్షించారు.

# సంక్రాంతి పండుగ అందరి జీవితాల్లో సంతోషాలను నింపాలి - జిల్లా ఎస్పీ



**ఒంగోలు,కలంకౌంటర్ :** జిల్లా పోలీస్ సిబ్బందికి , ప్రజలకు ప్రకాశం జిల్లా ఎస్పీ సంక్రాంతి శుభాకాంక్షలు తెలియ చేసారు. భోగి భోగభాగ్యాలను, సంక్రాంతి సుఖసంతోషాలను,కనుమ కమ్మని కనువిందులను అందించాలని, సంక్రాంతి పండుగను సుహృద్భావ వాతావరణంలో తెలుగు సంస్కృతి సాంప్రదాయాల మేల వింపుతో కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల నడుమ జరుపుకోవాలన్నారు. ఈ సంక్రాంతి పండుగ అందరి జీవితాలలో నూతన క్రాంతులను, సంతోషాలను నింపాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు తెలిపారు.

# కొత్తూరు తాడేపల్లిలో ఈవీఈ ఫ్రెండ్స్ సర్కిల్ సంక్రాంతి షటిల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ ప్రారంభం

- గ్రామీణ ప్రాంత క్రీడాకారులను ప్రోత్సహించేందుకు 13 ఏళ్లగా షటిల్ బ్యాడ్మింటన్ పోటీల నిర్వహణ
- కృష్ణా జిల్లా కబడ్డీ లీగ్ మాజీ అధ్యక్షుడు చలపాటి వెంకటేశ్వరరావు



**విజయవాడ రూరల్,కలంకౌంటర్ :** సంక్రాంతి పండుగ వేడుకల్లో భాగంగా ఈడా వేదాద్రి ఇంజనీర్స్ (ఈవీఈ) ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ జిల్లా విజయవాడ రూరల్ మండలం కొత్తూరు తాడేపల్లిలో మూడు రోజుల షటిల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ మంగళవారం ఘనంగా ప్రారంభమైంది. గ్రామీణ క్రీడా ప్రతిభను ప్రోత్సహించాలనే లక్ష్యంతో ఈవీఈ ఫ్రెండ్స్ సర్కిల్ గత 13 సంవత్సరాలుగా ఈ టోర్నమెంట్‌ను నిరంతరంగా నిర్వహిస్తోంది. కృష్ణా జిల్లా కబడ్డీ లీగ్ మాజీ అధ్యక్షుడు, ఈ–జోన్ చైర్మన్ చలపతి వెంకటేశ్వరరావు (సిహెచ్) ప్రారంభ మ్యాచ్ ఆడి టోర్నమెంట్‌ను అధికారికంగా ప్రారంభించారు. సబ్ జూనియర్, జూనియర్ మరియు సీనియర్ విభాగాల్లో నిర్వహిస్తున్న ఈ పోటీల్లో సుమారు 50 జట్లు పాల్గొంటున్నాయి. ఆటగాళ్లు, ప్రేక్షకుల ఉత్సాహభరిత పాల్గొనడం గ్రామంలో సంక్రాంతి పండుగ స్ఫూర్తిని మరింత ఉజ్జీవింపజేసింది. ఈ సందర్భంగా చలపాటి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, యువత క్రీడలపై మక్కువ పెంచుకోవాలని, క్రీడలు మంచి ఆరోగ్యం, క్రమశిక్షణతో పాటు మానసిక దృఢత్వాన్ని అందిస్తాయని అన్నారు. యువత అనారోగ్యకరమైన అలవాట్లకు దూరంగా ఉండేందుకు క్రీడలు ఎంతగానో దోహదపడతాయని పేర్కొన్నారు. 13 ఏళ్లుగా క్రీడా కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహిస్తున్న ఈవీఈ ఫ్రెండ్స్ సర్కిల్‌ను ఆయన అభినందించారు. ఈవీఈ ఫ్రెండ్స్ సర్కిల్ అధ్యక్షుడు ఈడా వేదాద్రి మాట్లాడుతూ, యువత చెడు మార్గాల వైపు వెళ్లకుండా క్రీడల వైపు మళ్లించాలనే ఉద్దేశంతో సంక్రాంతి మూడు రోజులపాటు ఈ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నామని తెలిపారు. గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు డబుల్స్ ఈవెంట్లను అన్ని విభాగాల్లో నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఈ టోర్నమెంట్ ద్వారా క్రీడా ప్రయాణం ప్రారంభించిన పలువురు ఆటగాళ్లు రాష్ట్ర, జాతీయ స్థాయిలో గుర్తింపు పొందడం తమకు గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమానికి అతిథులుగా వీరంకి రామచంద్రరావు, మడు శివయ్య, పలగాని రాజేశ్వరరావు హాజరై, పాల్గొన్న క్రీడాకారులకు అభినందనలు తెలియజేశారు.

# విదేశీ ఉద్యోగాల పేరుతో మోసాలకు పాల్పడే ఏజన్సీల పట్ల యువత అప్రమత్తంగా ఉండాలి - జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్



**విజయనగరం,కలంకౌంటర్ :** డిప్లమా, ఇంజనీరింగు, డిగ్రీ మరియు టెక్నికల్ గ్రాడ్యుయేట్లును లక్ష్యంగా చేసుకొని విదేశాల్లో ఉద్యోగాలు, ఉపాధి కల్పిస్తామని నమ్మించి మోసాలకు పాల్పడే ముఠాలు, ఆన్లైన్ సంస్థల పట్ల అప్రమత్తంగా ఉండాలని నిరుద్యోగ యువతకు, ప్రజలకు జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ పిలుపునిచ్చారు. జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ మాట్లాడుతూ – డిప్లమా, ఇంజనీరింగు, డిగ్రీ, టెక్నికల్ గ్రాడ్యుయేట్లును లక్ష్యంగా చేసుకొని విదేశాల్లో ముఖ్యంగా మయన్మార్, కాంబోడియా, సింగపూర్, థయిలాండ్, లావోస్ వంటి దేశాలలో ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని నమ్మించి, మోసాలకు పాల్పడే ఆన్లైన్ ఏజన్సీలు, ముఠాలు పట్ల ప్రజలు, యువత అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇటీవల కాలంలో నిరుద్యోగులకు విదేశాల్లో ఉపాధి కల్పిస్తామని, లక్షల్లో జీతాలు చెల్లిస్తామని, ఆశావహుల నుండి పెద్ద మొత్తంలో నగదు తీసుకొని మోసాలకు పాల్పడు తున్నట్లుగా కొన్ని సంఘటనలు ఇటీవల కాలంలో మన జిల్లాలో మరియు కొన్ని జిల్లాల్లో వెలుగు చూసాయన్నారు. యువత ఆసక్తిని గమనించి కొన్ని ఏజన్సీలు, ముఠాలకు సంబంధించిన వ్యక్తులు నిరుద్యోగులను ఆకర్షించేందుకు కొన్ని సందేశాలను ఆన్లైన్, వాట్సాప్, టెలిగ్రాం యాప్లలో పంపి, విదేశాల్లో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని నమ్మిస్తారన్నారు. విదేశాల్లో పని చేయుటకు ఆసక్తి కనబర్చిన యువతకు కొన్ని కంపెనీల్లో ఉద్యోగాలు కల్పించి, ఆసక్తి, చదువుతో సంబంధం లేని ఉద్యోగాల్లో నియమించి, వారితో సైబరు నేరాలు, ఇతర చట్ట వ్యతిరేక కార్యకలాపాలను చేయిస్తున్నారన్నారు. వారి ఇష్టంతో పని లేకుండా సైబరు నేరాల్లోను, చట్ట వ్యతిరేక కార్యకలాపాల్లోను భాగస్వాములను చేస్తున్నారన్నారు. ఈ తరహా ఉద్యోగాలు చేసేందుకు ఆసక్తి కనబర్చని ఉద్యోగుల నుండి పాస్పోర్టులను, ఇతర విలువైన డాక్యుమెంట్లు, డబ్బులను స్వాధీనం చేసుకొని, వారిని గుర్తుతెలియని ప్రాంతాలకు తరలించి, డార్క్ రూమ్స్ లో నిర్భందించి, శారీరక, మానసిక వేధింపులకు పాల్పడతారన్నారు. కావున, ఇటువంటి ఆన్లైన్ ఏజన్సీలు, సంస్థలు పట్ల యువత అప్రమత్తంగా ఉండాలని, విదేశీ ఉద్యోగాల మోజులో భోగస్ ఏజన్సీలు, ముఠాల ఉచ్చులో చిక్కుకోవద్దని జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ ప్రజలకు పిలుపునిచ్చారు. విదేశాల్లో ఉద్యోగాలు చేయాలన్న ఆసక్తి ఉన్న యువత ముందుగా తమకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్న సంస్థలు, ఏజన్సీల గురించి తెలుసుకోవాలని, ఆయా సంస్థల గురించి విచారణ చేసుకొని, పూర్తిగా సంతృప్తి చెందిన తరువాతనే ముందుకు వెళ్ళాలన్నారు. అవసరమైతే స్థానిక పోలీసుల సహాయం తీసుకోవాలని ప్రజలను జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ కోరారు.

# తామ్ర శాసనాలు పరిశీలించిన కలెక్టర్



**చెరుకుపల్లి (బాపట్ల జిల్లా),కలంకౌంటర్ :** చెరుకుపల్లి మండలం, పొన్నపల్లి అగ్రహారం గురించి 622 సంవత్సరాల నాటి తామ్ర శాసనాలను బాపట్ల జిల్లా కలెక్టర్ డాక్టర్ బి. వినోద్ కుమార్ కు చూపిస్తున్న అగ్రహార గ్రహీత వారసులు కొండపల్లి విద్యా భాస్కర్. గుడ్ ఫర్ బాపట్ల ఎన్జీవో ప్రముఖులు డాక్టర్ పి.సి. సాయిబాబు , అగ్రహార బాంధవులు పీసుపాటి వెంకటరమణ.

# కోనా కు సన్మానం



**ప.గో. జిల్లా,కలంకౌంటర్ :** పశ్చిమ గోదావరి జిల్లా ఐ వి ఎఫ్ అధ్యక్షులు,కార్యవర్గం కలిసి ఐ వి ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కోనా శ్రీనివాసరావు ను సన్మానించిన దృశ్యం.

# కోడిపందాలు నిర్వహిస్తే కఠిన చర్యలు-ఎస్సై మహేంద్ర నాయక్



**కందుకూరు, కలంకౌంటర్ :** కందుకూరు మండలం పలుకూరు పంచాయతీ లోని పత్తిపాటివారిపాలెం గ్రామ శివారులో సంక్రాంతి పండగ సందర్భంగా ఏర్పాటు చేసిన కోడి పందేల బరీని కందుకూరు రూరల్ ఎస్సై మహేంద్ర నాయక్ తన సిబ్బందితో కలిసి జే సి బి సహాయం తో తొలిగించి, ఆ స్థలాన్ని దున్నించారు. ఈ సందర్భంగా ఎస్సై నాయక్ మాట్లాడుతూ సంక్రాంతి సందర్భంగా కోడిపందాలు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# పోలీసు పరేడ్ గ్రౌండులో మిన్నంటిన సంక్రాంతి సంబరాలు - జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్















**విజయనగరం,కలంకౌంటర్ :** విజయనగరం జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో పోలీసు పరేడ్ గ్రౌండులో 'సంక్రాంతి సంబరాలు – 2026' ను జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ సతీమణి ఎ.ఆర్.రూపా నాయుడు ముఖ్య అతిథిగా హాజరై, సంక్రాంతి సంబరాలను ప్రారంభించారు. సంక్రాంతి సంబరాల్లో పోలీసు అధికారులు, సిబ్బందితోపాటు పోలీసు కుటుంబాలను కూడా భాగస్వాములను చేసి నూతన ఒరవడికి శ్రీకారం చుట్టారు. మహిళా పోలీసు ఉద్యోగులు, పోలీసు కుటుంబ మహిళలు వేసిన ముగ్గులను పరిశీలించారు. జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ మాట్లాడుతూ – సంక్రాంతి వేడుకలను పండగ వాతావరణంలో నిర్వహించుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. పోలీసు అధికారులు, సిబ్బంది, వారి కుటుంబ సభ్యుల కలయికతో సంక్రాంతి నిర్వహించుకోవాలనే సదుద్దేశంతో పోలీసు పరేడ్ గ్రౌండులో 'సంక్రాంతి సంబరాలు 2026' ను నిర్వహించుకున్నామన్నారు. ఈ వేడుకల్లో పోలీసు అధికారులు, సిబ్బంది, హెూంగార్డ్స్, మినిస్టీరియల్ స్టాఫ్ వారి కుటుంబ సభ్యులు ఎంతో ఉత్సాహంగా పాల్గొనడం శుభపరిణామమన్నారు. సంక్రాంతి పండగ అన్నది ఒక మతానికి, కులానికి చెందిన పండగ కాదని, వ్యవసాయదారులు కష్టించి పండించిన పంట చేతికి రావడం, సిరి సంపదలు, ఆదాయం చేతికి అందడంతో, కుటుంబ సభ్యులతో తమ ఆనందాన్ని పంచుకుంటూ, జరుపుకొనే వేడుకని అన్నారు. ప్రజలు వండగ పేరుతో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడవద్దని, పోలీసులకు సహకరించి పండగని సహృద్భవ వాతావరణంలో జరుపుకోవాలని సూచించారు. అనంతరం జిల్లా ప్రజలకు, పోలీసు కుటుంబ సభ్యులకు, పాత్రికేయులకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ సతీమణి ఎ.ఆర్. రూపా నాయుడు గారు మాట్లాడుతూ – సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించిన జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ కి, ఏర్పాట్లులో భాగస్వామ్యులైన ఇతర అధికారులు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. సంక్రాంతి సంబరాలను పోలీసు కుటుంబాలతో కలిసి ఒకే వేదిక మీద జరుపుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు. హెూదాలకు అతీతంగా సంక్రాంతి సంబరాల్లో పాల్గొన్న పోలీసు కుటుంబాలు ఎంతో ఆనందంగా సొంత కుటుంబ సభ్యుల్లాగ కలిసిపోయి, ఆహ్లాదకరమైన వాతావరణంలో వేడుకలను జరుపుకున్నారన్నారు. ఈ సంక్రాంతి స్మృతులతో కుటుంబ సభ్యులతో ఆనందంగా జీవించాలన్నారు. ఇదే స్ఫూర్తితో రాబోయే రోజుల్లో మరిన్ని మంచి కార్యక్రమాలను నిర్వహించుకొని, పోలీసులంతా ఒకే కుటుంబం అన్న సదృభవ వాతావరణాన్ని నెలకొల్పేందుకు కృషి చెయ్యాలన్నారు. ఈ కార్యక్రమానికి వచ్చిన వారందరూ క్షేమంగా, సురక్షితంగా తిరిగి వారి ఇండ్లకు చేరుకోవాలని ఆకాంక్షించారు. న్నారు. అనంతరం, జిల్లా ప్రజలకు, పోలీసు కుటుంబ సభ్యులకు, మీడియా మిత్రులకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. సంక్రాంతి సంబరాల్లో భాగంగా పోలీసు ఉద్యోగినులకు, పోలీసు కుటుంబాల మహిళలకు ప్రత్యేకంగా రంగోలి మ్యూజికల్ చైర్, లెమన్ అండ్ స్పూన్, టగ్ ఆఫ్ వార్ పోటీలను నిర్వహించారు. పోలీసుశాఖలో పనిచేస్తున్న మహిళలు, పోలీసు కుటుంబాలకు చెందిన మహిళలు, హెూంగార్డ్సు మరియు వారి పిల్లలు ఎంతో ఉత్సాహంగా పోటీల్లో పాల్గొని, భోగి, సంక్రాంతి, కనుమ పండగను ప్రతిబింబించే విధంగా ముగ్గలు వేసి, తమ సృజనాత్మకతను, క్రీడా ప్రతిభను ప్రదర్శించారు. విధి నిర్వహణలో భాగంగా ఎల్లప్పుడు ఖాకీ యూనిఫారం ధరించే పోలీసు అధికారులు, సిబ్బంది వారి కుటుంబ సభ్యులతో కలసి తెలుగుదనం ఉట్టిపడేలా సంప్రదాయ దుస్తులు ధరించి, వేడుకల్లో పాల్గొని, ప్రత్యేక ఆకర్షణ గా నిలిచారు. సంబరాల్లో హరిదాసు కీర్తనలు, బసవన్న విన్యాసాలు, కోలాట ప్రదర్శన, భరత నాట్యాలు, సంక్రాంతి గీతాలు అందరిని ఎంతగానో అలరించాయి. పోలీసు పిల్లలు గాలి పటాలు ఎగురవేసి, ఆనందంతో కేరింతలు వేసి, సంక్రాంతి సంబరాల్లో ఉత్సాహంగా గడిపారు. అనంతరం, జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ , ఆయన సతీమణి ఎ.ఆర్.రూపా నాయుడు, కుటుంబ సభ్యులతో కలిసి భోగి మంట వెలిగించారు. అనంతరం, ముగ్గుల పోటీలు, మ్యూజికల్ చైర్, లెమన్ అండ్ స్పూన్, టగ్ ఆఫ్ వార్, పాటల పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి ఎస్పీ సతీమణి ఎ.ఆర్.రూపా నాయుడు బహుమతులను ప్రదానం చేసారు. ఈ సంక్రాంతి సంబరాల్లో అదనపు ఎస్పీ పి.సౌమ్యలత, డిఎస్పీలు ఆర్.గోవిందరావు, ఎన్.రాఘవులు, జి.భవ్య రెడ్డి, ఆర్.వీరకుమార్, పి.నారాయణరావు, ఇ.కోటిరెడ్డి, సిఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు, ఆర్ఎస్ ఐలు , పెద్ద సంఖ్యలో పోలీసు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.







# నగరం రెవెన్యూ కార్యాలయాన్ని ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్..

–బాపట్ల జిల్లా,కలంకౌంటర్ :

# నారావారిపల్లెలో సంక్రాంతి సంబరాలు

## కుటుంబ సభ్యులతో కలిసి స్వగ్రామంలో ముఖ్యమంత్రి చంద్రబాబు












**నారావారిపల్లి,కలంకౌంటర్ :** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కుటుంబ సభ్యులతో కలిసి స్వగ్రామం నారావారిపల్లెలో సంక్రాంతి సంబరాల్లో పాల్గొన్నారు. సీఎం చంద్రబాబుతో పాటు ఆయన సతీమణి భువనేశ్వరి, మంత్రి లోకేష్, బ్రాహ్మణి పాల్గొన్నారు. సంబరాల్లో భాగంగా గ్రామంలోని చిన్నారులకు మ్యూజికల్ చైర్స్, బ్యాలెన్స్ వాకింగ్, గన్నీ బ్యాగ్ రేస్, లెమన్ అండ్ స్పూన్, కాక్ ఫైట్, త్రీలెగ్ రేస్, గ్లాస్ అండ్ బెలూన్ రన్ వంటి పలు క్రీడలను నిర్వహించారు. వీటన్నింటినీ సీఎం చంద్రబాబు ఆసక్తిగా తిలకించి సంతోషంగా గడిపారు. క్రీడల్లో చంద్రబాబు, బాలకృష్ణల మనవళ్లు కూడా పాల్గొన్నారు. అనంతరం ఆటల్లో విజేతలైనవారికి బహుమతులు అందజేశారు. చిన్నారులందరితో ఫోటోలు దిగి ఆప్యాయంగా సీఎం చంద్రబాబు ముచ్చటించారు. దాదాపు రెండు గంటల సేపు గ్రామస్తులు, చిన్నారులతో సీఎం చంద్రబాబు గడిపారు. మహిళలు వేసిన ముగ్గులను పరిశీలించి వారికి బహుమానాలు అందించారు. అనంతరం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారి నుంచి అర్జీలను అందుకుని పరిష్కారానికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.




Printed,Published and owned by Chitta Vasavidevi Printed at Rama Offset Printers, 7th ward, Ponnuru, Guntur District-522 124 Andhra Pradesh and Published at 7th ward, Ayyappa Nagar, Ponnuru-522 124, Guntur District. Andhra Pradesh. Editor : Chitta Vasavidevi. RNI No.APTEL/2016/69464, Phone No.9346935672, kalamcounter@gmail.com